సంగారెడ్డి జిల్లాలోని గుమ్మడిదలలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న బాధితులకు అండగా నిలిచిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

రెండు ఊర్ల నెత్తిన డంపింగ్‌యార్డు

మొదటిపేజీ తరువాయి...

పట్టుదలగా జీహెచ్‌ఎంసీ అధికారులు, పోలీసులు డంపింగ్‌యార్డు వద్దకు మంగళవారం అర్ధరాత్రి వందలాది టిప్పర్లతో రోడ్డు వేస్తుండటంతో ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. ఆగ్రహించిన స్థానికులు, రైతు సంఘం నాయకులు గుమ్మడిదలలోని జాతీయరహదారిపై బైఠాయించారు. 144 సెక్షన్ విధించి మరీ ఆ ప్రాంతాల్లో టెంట్లు వేసుకుని పోలీసుల బలగాలు, జీహెచ్‌ఎంసీ అధికారులు డంపింగ్‌యార్డు ఏర్పాటును పర్యవేక్షించారు. దీంతో తమను ఎక్కడా అరెస్టు చేస్తారో అనే భయంతో స్థానిక ప్రజలు అడవుల్లో, పంట పొలాల్లో తలదాచుకున్నారు. ఆ చీకట్లో బిక్కుబిక్కుమంటూ గడిపారు. కొత్తపల్లిలో ఓ యువకుడు అయితే డంపింగ్‌యార్డును వ్యతిరేకిస్తూ ఏకంగా సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, కొలను బాల్‌రెడ్డి, తొంట అంజయ్య సంఘటనా స్థలానికి చేరుకుని ఆ గ్రామాల ప్రజలకు మద్దతు పలికారు. ఎట్టి పరిస్థితిల్లోనూ డంపింగ్‌యార్డును ఏర్పాటు చేయనియ్యబోమని కాంగ్రెస్ సర్కారును హెచ్చరించారు. ప్రజలకు మద్దతుగా వచ్చిన స్థానిక ఎమ్మెల్యే సునీత, బీఆర్ఎస్ నాయకులు, రైతులను సైతం అక్రమంగా అరెస్టు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. డంపింగ్‌యార్డుతో తమ ఊళ్లను వల్లకాడు చేయొద్దని, నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని స్థానికులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులను అడ్డుకున్నారు. మొండిగా వ్యవహరిస్తే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కాగా వెంటనే పోలీసులు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు. కాగా మరో మూడు రోజుల పాటు డంపింగ్‌యార్డు పనులు కొనసాగుతాయని జీహెచ్‌ఎంసీ అధికారులు వెల్లడించారు. యూరోపియన్ టెక్నాలజీతో ఎలాంటి దుర్వాసన రాదని, పరిసరాలు కాలుష్యం కాకుండా డంపింగ్‌యార్డును నిర్వహిస్తామని జీహెచ్ ఎంసీ అదనపు కమిషనర్ దుర్గాప్రసాద్ తెలిపారు. సంగారెడ్డి అదనపు ఎస్పీ సంజీవ్‌రావు పర్యవేక్షణలో డంపింగ్‌యార్డు పనులు కొనసాగుతున్నాయి. ఆ ప్రాంతాల్లో పోలీసుల బలగాలు టెంట్లు వేసుకుని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఎమ్మెల్యేలకు నిరసన తెలిపే హక్కులేదా?

- సునీతా లక్ష్మారెడ్డిని తక్షణమే విడుదలచేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అక్రమ అరెస్టును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజాపాలన అంటూ ఊదరగొట్టి, ఎమర్జెన్సీని తలపించే నిర్బంధ చర్యలను ప్రభుత్వం మానుకోవాలని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఎమ్మెల్యేకు నిరసన తెలిపే హక్కు కూడా లేదా..? ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? అని మండిపడ్డారు. ప్రజలను భయపెట్టే నిరంకుశ వైఖరిని విడనాడకపోతే మరో లగచర్ల తరహా ఉద్యమాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా నల్లవల్లి, ప్యారానగర్‌లో అక్రమంగా అరెస్టుచేసిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మిరెడ్డితోపాటు బీఆర్ఎస్ నేతలను, అక్రమంగా నిర్బంధించిన అమాయకులైన ప్రజలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతున్న కాంగ్రెస్

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ సర్కార్ మంటగలుపుతున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాపోరాటాలకు వెన్నుదన్నుగా ఉన్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిని అరెస్టు చేయడాన్ని ఖండించారు. ప్రజాపాలన అంటూ ఊదరగొడుతున్న కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతున్నదని ధ్వజమెత్తారు. ఎన్ని నిర్బంధాలు సృష్టించినా.. ప్రజల పక్షాన నిలబడతామని స్పష్టంచేశారు. సంగారెడ్డి జిల్లా నల్లవల్లి, ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తున్న ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండలో బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ఇండ్లు కూల్చివేయడంతో దిక్కుతోచని స్థితిలో బాధిత కుటుంబం

దిక్కుతోచని స్థితిలో చారకొండ బాధితులు

- గూడు లేక బంధువుల ఇండ్లల్లో తలదాచుకున్నవైనం

చారకొండ, ఫిబ్రవరి 5 : కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ-మర్రిపల్లి మధ్య బైపాస్ నిర్మాణంలో అడ్డంగా ఉన్న 29 ఇండ్లను మంగళవారం అధికారులు కూల్చివేశారు. బుల్డోజర్లు ఇండ్లపైకి రావడంతో.. బాధితులు దిక్కుతోచక చిన్నాభిన్నమయ్యారు. కూల్చివేతలు ముగిశాక దొరికిన కాడికి సామగ్రిని తీసుకొని కన్నీళ్లను దిగమింగుకొని బరువెక్కిన గుండెలతో కదిలారు. కొందరు తెలిసినవారి ఇండ్లకు వెళ్లగా.. మరికొందరు బంధువుల ఇండ్లకు వెళ్లారు. ప్రభుత్వ పరిహారంతో కనీసం ఇంటి జాగా కూడా రాదని ఆవేదన వ్యక్తంచేశారు. సర్వం కోల్పోయి రోడ్డు పాలయ్యాయమని వాపోయారు. స్థలంతోపాటు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

నోట్లోకి అన్నం ముద్ద పోతలే..

జాతీయ రహదారి బైపాస్ నిర్మాణంలో 22 అరల జాగ, ఇంటితోపాటు సర్వం కోల్పోయాం. ఐదుగురు అన్నదమ్ములం కలిసి ఒక్కో గదిలో కుటుంబంతో నివసించేటోళ్లం. ప్రభుత్వం రూ.7 లక్షలు మాత్రమే పరిహారం ఇచ్చింది. దీంతో కనీసం వంద గజాల జాగ రాదు. ఇండ్లు కూల్చేటప్పుడు సామాన్లు తీసుకోనివ్వలే.. దండం పెట్టినా కరుణించలేదు.. పిల్లలతో కలిసి రూ.4 వేలకు గది అద్దెకు తీసుకున్నా.. ప్రభుత్వం ఆదుకోవాలి.

- కొప్ప లక్ష్మయ్య, చారకొండ

ఈ పరిస్థితి వస్తుందనుకోలే..

10 అరల స్థలంలో ఇళ్లు కట్టుకున్నాం.. ఇద్దరు కొడుకులు.. అందరం కలిసి ఒకే ఇంట్లో ఉండేటోళ్లం.. హైవే బైపాస్ రోడ్డు కోసమంటూ చెప్పకుండానే అధికారులు ఇల్లు కూల్చింద్రు. సామాన్లు కూడా తీసుకోలేదు. మా కుటుంబం రోడ్డున పడింది. చేసేది లేక అప్పటికప్పుడు ఊళ్లో వెతికి రూం అద్దెకు తీసుకున్నా. మాకు ప్రభుత్వం న్యాయం చేయాలి.

- గ్యార లాలమ్మ, చారకొండ

ఎమ్మెల్యే సునీత అరెస్టు దుర్మార్గం

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజం

నల్లవల్లి, ప్యారానగర్‌లో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి సహా పార్టీ నేతలను అరెస్టు చేయటాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఖండించారు. రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజా పాలన కాదని, ఎమర్జెన్సీ పాలన అని దుయ్యబట్టారు. ప్రభుత్వం నిరంకుశ వైఖరి వీడకుంటే ప్రజలు తగినబుద్ధి చెబుతారని హెచ్చరించారు. రేవంత్ సర్కారు ఇకనైనా తన పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ

- ప్రజాప్రతినిధుల అక్రమ అరెస్టులు ఎందుకు?
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితోపాటు బీఆర్ఎస్ పార్టీ నేతల అరెస్టులను ఆయన తీవ్రంగా ఖండించారు. సంగారెడ్డి జిల్లా నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల పరిధిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న స్థానిక ప్రజలు, రైతులకు మద్దతు తెలిపేందుకు ప్రజాప్రతినిధి వెళ్లకూడదా? స్థానిక ఎమ్మెల్యేగా వారి యోగ క్షేమాలను పట్టించుకోకూడదా? అని ప్రశ్నించారు. ప్రజలను, ప్రజాప్రతినిధులను అర్ధరాత్రి నుంచి అక్రమ అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్లలో ఎందుకు నిర్బంధిస్తున్నారని నిలదీశారు. నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో 144 సెక్షన్ విధించి, భయానక వాతావరణం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యమంటే అని ప్రశ్నించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులకు వారి అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పుకునే హక్కే లేదా? అక్రమంగా అరెస్టు చేసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డితోపాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదలచేయాలని, డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతున్నది

- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజాపాలన కాదని, రాక్షసపాలన అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిని అరెస్టు చేయటం దుర్మార్గమన్నారు. ప్రజావ్యతిరేక నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వం రాక్షసంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిరంకుశ వైఖరి వీడకుంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న పత్తి రైతులు

చెన్నూర్‌లో పత్తి రైతుల ధర్నా

ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్

చెన్నూర్, ఫిబ్రవరి 5: ఎలాంటి ఆంక్షలు, పరిమితి లేకుండా సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై బుధవారం పత్తి రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పత్తి రైతులు మాట్లాడుతూ వందలాది వాహనాలు వస్తే 40 నుంచి 50 మందికి టోకెన్లు ఇచ్చి వారి పత్తిని మాత్రమే కొంటున్నారని మిగతా రైతులంతా గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. చెన్నూర్ మార్కెట్ కమిటీ పరిధిలోని ఐదు జిన్నింగ్ మిల్లుల ద్వారా ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేసే పరిస్థితి ఉన్నప్పటికీ సీసీఐ అధికారులు మాత్రం రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ప్రైవేట్ వ్యాపారులతో కుమ్మక్కై ఇలా చేస్తున్నారని మండిపడ్డారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో ఎరువుల కోసం బారులు తీరిన రైతులు

సాగు కన్నా యూరియా తిప్పలే ఎక్కువ

- రోజులకొద్దీ తిరుగుతున్న రైతులు
- ఎల్లారెడ్డిపేట, పెద్దలింగాపూర్‌లో బారులుతీరిన అన్నదాతలు
- సరిపడా అందక నిరాశతో వెనుదిరిగిన అన్నదాతలు

ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ పాలనలో రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. నాట్లు వేసి రెండు నెలలైనా యూరియా దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట పీఏసీఎస్ గోదాముకు లోడ్ వచ్చిందని తెలియగానే పోతిరెడ్డిపల్లి, రాగట్లపల్లి, నారాయణపూర్, బండలింగంపల్లి, హరిదాస్‌నగర్, దుమాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పరిస్థితిని గమనించిన అధికారులు పోలీసుల సాయంతో యూరియా పంపిణీ చేశారు. పలు కుబడి ఉన్నోళ్లకే యూరియా ఇస్తున్నారని కొందరు రైతులు హమాలీలతో గొడవకు దిగారు. మరో లోడు వస్తుందని చెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అలాగే ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ పీఏసీఎస్ గోదాం వద్ద కూడా రైతులు బారులు తీరారు. సిరికొండ, దాచారం, రామోజీపేట, చిక్కుడువాని పల్లి, అనంతగిరి, తెనుగువానిపల్లికి చెందిన రైతులు ఉదయం నుంచే నిరీక్షిస్తున్నారు. సరిపడా యూరియా దొరక్క నిరాశతో వెనుదిరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎరువులు సకాలంలో అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఎరువులు వస్తాయని పీఏసీఎస్ సిబ్బంది నచ్చజెప్పి పంపించారు.

నాట్లేసి 45 రోజులైతంది

నాట్లేసి 45 రోజులైతుంది. వారం సందు యూరియా కోసం తిరుగుతున్న. ఎప్పుడు పోయినా స్టాక్ లేదు రేపు రమ్మంటున్నరు. ఇయ్యాళ కూడా నేను వచ్చేసరికి బస్తాలైపోయినయ్. యాష్టకొచ్చి నిలదీస్తే నాకు టోకెన్ చ్చిర్రు. మరి అడుగనోళ్ల సంగతేంది? ఎన్నడూ గింతగనం తిప్పలు పడలె.

-కుంబాల లక్ష్మారెడ్డి, రైతు, ఎల్లారెడ్డిపేట

కొడంగల్ ఎత్తిపోతల సర్వే అడ్డగింత

ఊట్కూర్, ఫిబ్రవరి 5 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనుల సర్వేకు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. మక్తల్ నియోజకవర్గంలోని భూత్పూరు రిజర్వాయర్ నుంచి ఊట్కూర్ పెద్ద చెరువు మీదుగా పేరపళ్ల జయమ్మ చెరువు నుంచి కొడంగల్‌కు 7 టీఎంసీల సాగునీటిని అందించేలా చేపట్టిన ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1,200 కోట్లు కేటాయించి మేగా ఇంజినీరింగ్ కంపెనీకి అప్పగించింది. బుధవారం సర్వే కోసం వచ్చిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. ఊట్కూర్ మండలం బాపురం, తిప్రాస్‌పల్లి శివారు రైతుల వ్యవసాయ పొలాల్లో ఇరిగేషన్ డీఈ కేతన్‌కుమార్, ఏఈఈ వెంకటప్ప, రెవెన్యూ అధికారులు, సిబ్బంది సహకారంతో ఓపెన్ కెనాల్, పంప్‌హౌస్, సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం సర్వే నిర్వహణకు సిద్ధం కావడంతో విషయం తెలుసుకున్న ఇరు గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పొలాల వద్దకు చేరుకున్నారు. సీఎం సొంత జిల్లాలోనే తమ పొలాలకు భద్రత లేకుండా పోయిందని అధికారులను నిలదీశారు. ప్రాణాలు పోయినా భూములు ప్రాజెక్టులో పోనిచ్చేది లేదని చెప్పారు. ఇరిగేషన్ అధికారులను రైతులు, బీఆర్ఎస్ నేతలు అడ్డుకుని వారి వాహనాన్ని ఊరి పొలిమేర నుంచి దాటించారు. స్థానిక ఎమ్మెల్యే, సీఎం స్పందించి భూ సేకరణ కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని కోరారు.

నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం తిప్రాస్‌పల్లి-బాపురం గ్రామాల మధ్య రోడ్డుపై రైతులతో కలిసి బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు

కొంగరకలాన్‌లో పోలీస్ పహారాలో ఫోర్త్‌సిటీ రోడ్డు సర్వే చేస్తున్న అధికారులు

పోలీసు పహారాలో ఫోర్త్‌సిటీ రోడ్డు సర్వే

రైతులు లేని సమయంలో పనులు.. సర్కారు తీరుపై అన్నదాతల ఆగ్రహం

ఆదిభట్ల, ఫిబ్రవరి 5: కొంగరకలాన్, ఫిరోజ్‌గూడ రెవెన్యూ పరిధిలో బుధవారం పోలీస్ పహారాలో ఫోర్త్‌సిటీ రోడ్డు సర్వేను అధికారులు చేపట్టారు. భూములు కోల్పోతున్న రైతులకు ఉదయం సర్వేకు వస్తున్నట్టు అధికారులు సమాచారం ఇవ్వగా.. వారు వేచిచూశారు. అధికారులు రాకపోవడంతో ఎవరి పనులకు వాళ్లు వెళ్లిపోయారు. ఆ తర్వాత వచ్చిన అధికారులు ఎవరూ లేని సమయంలో సర్వే చేపట్టారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని, తద్వారా రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని తెలిపారు. గతంలో కొంగరకలాన్‌లో గ్రామసభ ఏర్పాటు చేసి రైతులకు భూ సేకరణ గురించి వివరించగా ఇచ్చేది లేదని వారు తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా ఆదిభట్ల ఎస్సై వెంకటేస్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్వేయర్, ఆర్ఐ, ఆర్‌అండ్‌బీ ఏఈ, వ్యవసాయ శాఖాధికారి, ఎక్సైజ్ సీఐ పాల్గొన్నారు.

కనీస సమాచారం ఇవ్వలేదు

అధికారులు కనీసం సమాచారం ఇవ్వడం లేదు. ఎంత భూమి పోతుందో, ఎంత పరిహారం ఇస్తారో చెప్పడం లేదు. ఇప్పటికే కేన్స్, ఫాక్స్‌కాన్ కంపెనీలకు భూమి ఇచ్చా. బతుకులు బాగు చేస్తారని కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే మిగిలిన ఎకరం 20 గుంటల భూమిని కూడా గుంజుకుంటున్నారు.

– కొసికే మౌలాలి, రైతు, కొంగరకలాన్

మా జీతాలు ఎప్పుడిస్తరు?

టీవీవీపీ సిబ్బంది నిరసన

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టీవీవీపీ దవాఖానల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి ఐదారు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఈ నేపథ్యంలో వేతనాలు చెల్లించాలని కోఠిలోని టీవీవీపీ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించిన విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా టీవీవీపీ దవాఖానల ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఇప్పటికైనా పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

రోడ్డుపైన నిరసన వ్యక్తం చేస్తున్న సలార్‌తండావాసులు

ఎన్‌హెచ్‌కు భూములివ్వం

సర్వే అధికారులను అడ్డుకున్న తండావాసులు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సలార్‌తండాలో ఎన్‌హెచ్‌కు భూములివ్వమని స్థానికులు తేల్చిచెప్పారు. బుధవారం జాతీయ రహదారి (930పీ) కోసం అధికారులు పోలీసులతో వచ్చి సర్వేను ప్రారంభించగా తండావాసులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట పొలాల నుంచి జాతీయ రహదారి వేస్తే తమ బతుకులు ఆగం అవుతాయని ఆవేదన వ్యక్తంచేశారు. 100 ఇండ్లు, పంట పొలాలకు తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. ఆందోళన విరమించకపోవడంతో తండావాసులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

పరీక్ష హాల్‌లో కస్తూర్బా విద్యార్థినులకు అస్వస్థత

- దవాఖానకు తరలించిన సిబ్బంది

ఆత్మకూరు, ఫిబ్రవరి 5 : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షా కేంద్రంలో కస్తూర్బా గురుకుల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వొకేషనల్ గ్రూప్‌లో ఎంఎల్‌టీ చదువుతున్న ఇద్దరు విద్యార్థులు బుధవారం ఉదయం 9 గంటలకు ప్రాక్టికల్స్ పరీక్షకు హాజరయ్యారు. గంటన్నర తర్వాత పరీక్ష రాస్తుండగా వాంతులు చేసుకోవడంతో కళాశాల ప్రిన్సిపాల్ వారిని దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు ఒకరిని వనపర్తి జిల్లా దవాఖానకు సిఫారసు చేయగా.. మరొకరికి స్థానికంగా వైద్యం అందిస్తున్నారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అంజయ్య విద్యార్థులను పరామర్శించారు. విద్యాలయంలో పుడ్ పాయిజన్ కావడంతోనే అస్వస్థతకు గురైనట్లు పలువురు ఆరోపించారు.

చెరువులు నింపి పంటలు కాపాడండి

- తహసీల్దార్‌కు ముస్తాబాద్ రైతుల వినతి
- ప్రత్యేక బస్సులో మల్లన్నసాగర్‌కు పయనం

ముస్తాబాద్, ఫిబ్రవరి 5: మల్లన్నసాగర్ ప్రాజెక్టు కాలువల ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని ఎగువ ప్రాంతాల్లో ఉన్న చెరువులు, కుంటలు నింపాలని ఆ మండలంలోని పలు గ్రామాల రైతులు కోరారు. బుధవారం ముస్తాబాద్ పట్టణ అఖిలపక్షం ఆధ్వర్యంలో రైతులు తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫిబ్రవరి మొదటి వారం ప్రారంభంలోనే ఎండలు ముదరడంతో మండలంలో నీటి ఎద్దడి ఏర్పడకుండా మానేరు కాలువకు ఎగువన ఉన్న గ్రామాల్లోని చెరువులు, కుంటలను మల్లన్నసాగర్ జలాలతో నింపాలని కోరారు. అధిక శాతం రైతులు యాసంగిలో వరి సాగు చేశారని, ఎండ తీవ్రత అధికమైతే నీటి ఎద్దడి ఏర్పడుతుందని పేర్కొన్నారు. పంటలు ఎండిపోకుండా ముందస్తు చర్యలు తీసుకుని చెరువులు, కుంటలు నింపాలని కోరారు. అనంతరం వారు ప్రత్యేక బస్సుల్లో మల్లన్నసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. మండలానికి నీటిని తరలించే స్థాయిలో నీరున్నదని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముస్తాబాద్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, జిల్లా కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ సర్వర్‌పాషా, మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి, గూడూరి భరత్, తాళ్ల రాజుతోపాటు రైతులు పాల్గొన్నారు.



మల్లన్నసాగర్ ప్రాజెక్టు కాలువ ద్వారా చెరువులు, కుంటలను నింపాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు